క్లుప్తంగా

పోలినాయుడుచెరువులో పోలీస్ పికెట్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పోలినాయుడుచెరువులో పోలీస్ పికెట్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పెద్ద రఫీ నాగాయగుంట వద్ద హత్యకు గురైన నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పికెట్‌ను ఏర్పాటు చేశామని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్సీపీ నేత మృతి

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వెలుగు తిరుమలరావు (50) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మరణించారు. ఆయన పార్థివదేహానికి పలువురు నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

వెంకటాచలం: 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ మూడో వార్షిక శిక్షణ శిబిరం బుధవారం కూడా కొనసాగింది. శారీరక వ్యాయామం, నౌక నమూనా నిర్మాణం, ఆయుధ శిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఎన్‌సీసీ జనరల్, సోషల్ అవేర్నెస్, రిగ్గింగ్ , డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై డాక్టర్ ప్రమోద్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు శిక్షణ ఇచ్చారు.

సాధారణ సమావేశం నిర్వహణలో కాలయాపన

- డీపీఓకు సర్పంచ్ ఫిర్యాదు

పొదలకూరు: మండలంలోని వావింటపర్తి పంచాయతీలో సెక్రటరీ మూడునెలలకో పర్యాయం పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నాడని సర్పంచ్ నెట్టెం కృష్ణయ్య డీపీఓ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రజల చేత ఎన్నుకోబడిన పంచాయతీ బోర్డును ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. జీఓ నంబర్ 199 ప్రకారం విధులు నిర్వహించడంలో సెక్రటరీ విఫలమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న సివిల్ సప్లయ్స్ గోదామును బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిల్వ ఉన్న బియ్యం బస్తాలను, పామాయిల్ ప్యాకెట్లను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు సకాలంలో బియ్యం అందించాలన్నారు. రేషన్ షాపుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు. గోదాములో తనిఖీ చేసినప్పుడు 300 కిలోల బియ్యం, పది నూనె ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయని వీటిపై జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట ఎన్ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ కృష్ణప్రసాద్, వెంకటరెడ్డి, డీటీ హరిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

రాడార్ కేంద్ర పనుల్లో పురోగతి

- 63 ఎకరాల కేటాయింపు
- కలెక్టర్ చొరవతో కదిలిన యంత్రాంగం
- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- చెన్నై వింగ్ కమాండర్ పర్యవేక్షణలో పనులు



కేంద్రం లోపల చర్చిస్తున్న మండల స్థాయి అధికారులు

పొదలకూరు: విమాన సర్వీసుల దిశ, దశను నిర్దేశించే రాడార్ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు యంత్రాంగం కదిలింది. ఇప్పటి వరకు ఇక్కడ చెన్నై వింగ్ కమాండర్ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. అయితే కేంద్రంలో పనులు వెనుకబడుతున్న నేపథ్యంలో కలెక్టర్ చొరవ తీసుకోవడంతో మండల యంత్రాంగం యుద్ధప్రాతిపదిన చర్యలు చేపట్టింది. మండలంలోని నెల్లూరు మార్గం మరుపూరు గ్రామ సమీపంలో 2010లో రాడార్ కేంద్రానికి 63 ఎకరాల రెవెన్యూ భూమిని కేటాయించారు. ఈ ప్రాంతంలో సిగ్నల్స్ బాగా అందుతున్నట్టు అప్పట్లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ అధికారులు గుర్తించి భూములను కేటాయించాల్సిందిగా కోరారు. కేంద్రం ఇక్కడ నెలకొల్పితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు పెద్ద టౌన్ షిప్ ఏర్పడుతుందని జిల్లా ఉన్నత స్థాయి అధికారులు అప్పట్లో భూములను కేటాయించారు. భారత వైమానిక దళ అధికారులు రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ప్రకటించినా తర్వాత చాలాకాలం జాప్యం నెలకొంది. రెండేళ్లుగా ఇక్కడ పనుల్లో వేగం పెరిగింది. వారికి కేటాయించిన భూముల చుట్టూ ప్రహరీ, లోపల భవనాలు, సెక్యూరిటీ గదులను నిర్మించారు. ఇందుకోసం తొలివిడతగా రూ.9 కోట్ల వరకు వెచ్చినట్టు సమాచారం.

పనుల్లో పెరిగిన వేగం

రాడార్ కేంద్రం పనుల్లో వేగం పెరిగింది. ఇక్కడ మౌలిక వసతులను కల్పించేందుకు స్థానిక అధికార యంత్రాంగం సహకారం అవసరం కాబట్టి సంబంధిత వ్యక్తులు కలెక్టర్‌కు లేఖ రాసినట్టు తెలిసింది. దీంతో ఆయన చొరవ తీసుకుని మండల స్థాయి అధికారులను పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఇటీవల తహసీల్దార్ బి.శివకృష్ణయ్య ఆధ్వర్యంలో అన్నిశాఖ అధికారులు కేంద్రం వద్దకు చేరుకుని వివిధ అంశాలపై చర్చించారు.

నీటి సౌకర్యం కోసం..

కేంద్రానికి ప్రధానంగా నీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులు సమాలోచనాలు చేశారు. సమీపంలో కండలేరు ఎడమగట్టు కాలువ ఉంది. దాని ద్వారా నీటిని సరఫరా చేయాలనే ఆలోచన ఉన్నా కాలువకు నిరంతరం నీరు విడుదల చేసే పరిస్థితి లేదు. దీంతో మరుపూరు చెరువు నుంచి నీటిని సరఫరా చేయాలని అధికారులు చర్చించుకున్నట్టు సమాచారం. తర్వాత విద్యుత్ సదుపాయం కోసం చాటగొట్ల విద్యుత్ ఉప కేంద్రం నుంచి సరఫరా చేసేందుకు పరిశీలించారు. ఇంటర్నెట్ తదితర సదుపాయాలను కూడా కల్పించనున్నట్టు అధికారులు వెల్లడించారు. రోడ్లు నిర్మించేందుకు ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించడం జరిగింది.



రాడార్ కేంద్రం మెయిన్ గేటు

మౌలిక వసతులు కల్పిస్తాం



రాడార్ కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు ఇటీవల వెళ్లి పరిశీలించడం జరిగింది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. నీరు, విద్యుత్ సౌకర్యాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతోంది.

– బి.శివకృష్ణయ్య, తహసీల్దార్, పొదలకూరు

యోగా సాధనతో ఆరోగ్య పరిరక్షణ



కోవూరు: యోగా సాధనతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని గ్రంథాలయాధికారి రాజేశ్వరి సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కొడవలూరులోని గ్రంథాలయంలో యోగాపై విద్యార్థులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నతనం నుంచే యోగా సాధనను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం శిబిరంలో నేర్చుకున్న కఠిన పదాలపై డిక్టేషన్ నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన



నెల్లూరు(పొగతోట): జెడ్పీ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం అభినందించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పూజిత, కృషినగర్ (595), జువేరియా, నవలాకుల గార్డెన్స్ (594), జ్ఞాపిక, వింజమూరు.. భార్గవ్, నర్సాపురం (593)ను అభినందించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌సింగ్, శ్రీనివాసులు, మాలకొండయ్య, నాగేశ్వరరావును సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం కొనుగోళ్లు.. అంతంతమాత్రం

- 50 శాతానికి పైగా పతనం
- ధరల పెరుగుదలే కారణం
- అక్షయ తృతీయ రోజున వెలవెలబోయిన దుకాణాలు



నెల్లూరులోని ఓ షాపులో ఇలా..

నెల్లూరు(బృందావనం): రోజురోజుకూ పెరుగుతున్న పసిడి ధరలతో అక్షయ తృతీయ వెలవెలబోయింది. పేద, మధ్య తరగతి వారితో పాటు ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు తమకు తోచిన రీతిలో బంగారాన్ని కొనుగోలు చేయడం ఏటా పరిపాటి. అయితే ఈ దఫా పది గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షకు చేరువ కావడంతో చాలామంది ఆసక్తి చూపలేదు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి 50 శాతం మేర విక్రయాలు తగ్గిపోయాయి. గతేడాది అక్షయ తృతీయ నాటికి 24 క్యారెట్లు (10 గ్రాములు) ధర రూ.75,380 ఉండగా, ఈసారి రూ.98,750కు చేరింది. 22 క్యారెట్ల ఆర్నమెంట్ (ఒక గ్రాము) ధర నాడు రూ.6,751 ఉండగా ఇప్పుడు రూ.8,980కు పెరిగింది. సవర (8 గ్రాములు) అప్పుడు రూ.55,632 ఉండగా, ఈసారి రూ.74 వేలుగా ఉంది. దీంతో బంగారం కొనుగోలు చేయాలంటే జనం బెంబేలెత్తిపోతున్నారు.

చాలా తక్కువగా కొనుగోలు



భారీగా పెరిగిన బంగారం ధరతో ఈ ఏడాది అమ్మకాల్లేవు. చాలావరకు గ్రాము, రెండు, మూడు గ్రాములకే పరిమితమయ్యారు. 50 శాతం మేర అమ్మకాలు పడిపోయాయి. గతంలో అక్షయ తృతీయ రోజున షాపులు కళకళలాడేవి. ఈ ఏడాది ఆ పరిస్థితే లేదు.

– కొనగళ్ల శోభన్‌బాబు, నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

3న డయాలసిస్ సెంటర్ ప్రారంభం

పొదలకూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఈనెల 3వ తేదీన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

మేడే ర్యాలీ నేడు

పొదలకూరు: పట్టణంలో గురువారం ఉదయం 10 గంటలకు మేడే ర్యాలీ నిర్వహిస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి బి.మనోహర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామనగర్‌గేటు సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అన్ని రకాల ట్రేడ్ యూనియన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని వెల్లడించారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2025 – 26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని తెలియజేశారు.

మానసిక దివ్యాంగుల కేంద్రంలో సందర్శన

వెంకటాచలం: మండలంలోని వెంకటాచలంలో ఉన్న మానసిక దివ్యాంగుల కేంద్రాన్ని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బుధవారం సందర్శించారు. భోజన వసతి గురించి ఆరాతీశారు. పరిశుభ్రత గురించి చిన్నారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కిడాంబి జితేంద్రాచార్యులు, పాలేటి శివకుమార్, గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. వెంకటేశ్వరస్వామితో పాటు వామనమూర్తి, వినాయకుడు, ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, సుబ్రహ్మణ్యస్వామి, నాగేంద్రుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమాలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేడుకగా జరిపారు.

సత్యనారాయణ లేఅవుట్ వద్ద ధర్నా



లేఅవుట్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

పొదలకూరు: 1985వ సంవత్సరంలో వేసిన సత్యనారాయణ ట్రేడర్స్ లేఅవుట్ స్థలంలో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించి పంచాయతీకు అప్పగించిన 286 అంకణాల స్థలాన్ని కొందరు కబ్జా చేశారని బుధవారం స్థానికులు ధర్నా నిర్వహించారు. శ్రీసత్యనారాయణ ట్రేడర్స్ లేఅవుట్ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో ఆందోళనకు దిగారు. కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓలకు వినతిపత్రాలను సమర్పిస్తున్నట్టు అసోసియేషన్ సెక్రటరీ బి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్లు 386, 369, 370/1, 370/2లో 9.45 ఎకరాల్లో లేఅవుట్ వేశారని తెలిపారు. 130 ప్లాట్లను ఏర్పాటు చేశారని, పార్కు, ఆట స్థలం కోసం 286.62 అంకణాలను కేటాయించినట్టు వెల్లడించారు. ఖాళీగా ఉన్న ప్రజాప్రయోజనాల కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారని పేర్కొన్నారు. సదరు లేఅవుట్లో మేనేజింగ్ పార్టనర్స్ ముప్పసాని పాండురంగారావు, తెలనాకుల వెంకటేశ్వర్లు కాలం చేసినట్టు తెలిపారు. వీరితో పరిచయాలున్న సుబ్బానాయుడు తన భార్య, ఆమె సోదరి పేరుపై ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపించారు. అప్పట్లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన తహసీల్దార్ ద్వారా సర్వే చేయించి పంచాయతీ స్థలంగా గుర్తించి బోర్డును పెట్టించినట్లు చెప్పారు. కబ్జాదారులు బోర్డును తీసేసి స్థలాన్ని చదును చేయించేందుకు ప్రయత్నిస్తే పంచాయతీ సెక్రటరీ ఆపారన్నారు. ఈ విషయాన్ని డీపీఓ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా సెక్రటరీని ఆదేశించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. రూ.కోట్ల విలువైన స్థలాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



సూచనలు చేస్తున్న చైతన్య

నెల్లూరు(బారకాసు): నగరంలోని ప్రధాన రహదారుల పక్కన చెత్తను వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఎంహెచ్ఓ చైతన్య పేర్కొన్నారు. నగరంలోని 47వ డివిజన్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 44, 46వ డివిజన్లో నైట్ శానిటేషన్ జరుగుతోందని, ఇక నుంచి ఈ డివిజన్లోనూ జరపాలని సూచించారు.

సీహెచ్‌ఓలకు అండగా పోరాటం



నెల్లూరు(అర్బన్): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న పోరాటానికి ఏపీ హంస అసోసియేషన్ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, కోశాధికారి మజహర్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు చేపట్టిన ఆందోళన బుధవారంతో రెండో రోజుకు చేరింది. వీరికి మద్దతు తెలిపిన అనంతరం సుధాకర్‌రావు మాట్లాడారు. వీరికి ఫిక్స్‌డ్ జీతాలివ్వకపోవడం, ఆయుష్మాన్ భారత్ మందిరాల అద్దె చెల్లించకపోవడం దారుణమన్నారు. వీరి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నేతలు నాగరాజు, ఉమా, రవి, సీహెచ్‌ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, కార్యదర్శి రెబకా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏల నిరసన



నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నాను జిల్లాలోని వీఆర్‌ఏలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య మాట్లాడారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ జీతాలను చెల్లించాలని కోరారు. ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ, వీఆర్వో, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయకుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గయ్య, భాస్కర్, లచ్చయ్య, ఓబులేసు, శ్రీను, అమీర్, అంకయ్య, జమున, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

తరగతుల నిర్వహణపై చర్యలకు వినతి



ఏడీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ గ్లోరీ కుమారికి వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అడ్మిషన్లను అక్రమంగా నిర్వహిస్తూ, యూనిఫారం, పుస్తకాలకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మస్తాన్, హర్ష, పూజిత్, లోకేష్, చరణ్, నవీన్ పాల్గొన్నారు.

రీచ్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు



రీచ్‌ను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని బోడిగాడితోట, సుభాన్‌నగర్, దీన్‌దయాళ్‌నగర్, పొర్లుకట్ట, దొరతోపు, వెంకటేశ్వరపురం, టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణం తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో రీచ్‌ల నుంచి ఇసుక రవాణా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. హరనాథపురంలోని కాలువపై ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. బీవీఎస్ బాలికల పాఠశాలలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, వాలీబాల్ కోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం తడికలబజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

శోకసంద్రం



రోదిస్తున్న విద్యార్థినులు



కడచూపునకు వచ్చిన తోటి విద్యార్థులు



కోవూరు సమీపంలోని పోతిరెడ్డిపాళెం వద్ద కారు అదుపుతప్పడంతో ఐదుగురు వైద్య విద్యార్థులు, దుకాణ నిర్వాహకుడు మృతిచెందారు. పెద్దాస్పత్రి మార్చురీ వద్దకు చేరుకున్న సహచర విద్యార్థులు, రమణయ్య కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. వీరి ఆవేదన పలువుర్ని కంటతడికి గురిచేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వివరాలు ఆరాతీస్తున్న పోలీస్ అధికారులు



విలపిస్తున్న రమణయ్య కుటుంబీకులు